క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ 33కేవీ ఫీడర్‌లో ఆదివారం విద్యుత్ మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బంగారుగూడ, పిప్పల్‌ధరి, అంకోలి, సాత్నాల సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పాఠశాలలో వసతులు ఉండేలా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: ప్రతీ పాఠశాలలో వసతులు ఉండేలా చూడాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శనివారం అమ్మ ఆదర్శ పాఠశాలపై ఐకేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో వసతులు ఉండేలా చూడాలన్నారు. తాగునీరు, పాఠశాల భవన మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్యం, విద్యార్థుల యూనిఫాం తదితర ఏర్పాట్లు ఉండేలా చూడాలని పాఠశాలల ఉపాధ్యాయులను ఆదేశించారు. సమావేశానికి ఎంఈవో భూమారెడ్డి, ఎంపీవో లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలలకు మరమ్మతులు చేపట్టానున్నట్లు ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు, తాగునీటి సౌకర్యం, తరగతి గదుల్లో విద్యుత్ సరఫరా, తదితర మరమ్మతులు చేపట్టానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ కమిటీలు పనులను పర్యవేక్షించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మన్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిచ్‌ధరి ఖానాపూర్ ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని హత్తిగుట్ట, మారుగూడ, బోరింగ్‌గూడ మారుమూల గిరిజన గ్రామాల్లో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అలాగే చిన్నారులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, మర్సుకోల లక్ష్మీబాయి, హెల్త్ అసిస్టెంట్ పవర్ ప్రేంసింగ్, సిబ్బంది నారాయణ, సత్యవతి, శైలజ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇఫ్తార్

కైలాస్‌నగర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 7న ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సెంట్రల్ గార్డెన్‌లో సాయంత్రం 6గంటలకు జరిగే విందుకు ఉపవాసాలు చేస్తున్న ముస్లింలతో పాటు కుల, మతాలకతీతంగా ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఉపాధి పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: మండలంలోని తర్నం(కె) గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఎంపీడీవో రాజ్‌వీర్ పరిశీలించారు. గ్రామానికి ఆనుకొని ఉన్న గుట్టపై పనులను చేపడుతున్నారు. పనులు ఎలా జరుగుతున్నాయో పని ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. కూలీలకు పనికి దగ్గ వేతనాలు అందించాలని సంబంధిత ఉపాధిహామీ అధికారులను ఆదేశించారు.

'రైతులపై బీజేపీది కపట ప్రేమ'

ఖానాపూర్: రైతు సమస్యలపై బీజేపీ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోందని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ నాయక్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ, పంజాబ్ రైతులు తమ సమస్యలపై రోడ్లపై నిరసన తెలిపితే రబ్బరుగుండ్లు, వాటర్ ట్యాంకర్లతో రైతుల ఆందోళనను అణిచివేశారని అన్నారు. ఇవన్నీ మరిచి రైతు సమస్యలపై సత్యాగ్రహ దీక్షలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. రైతుల గురించి మాట్లాడే బీజేపీ రైతులకు ఏం చేసిందో చెప్పాలన్నారు.

కొన్నారు.. మూలన పడేశారు

- నిరుపయోగంగా బల్దియా స్వీపింగ్ యంత్రం
- రెండు నెలలు కూడా పనిచేయని వైనం
- మరమ్మతుల పేరిట కాలయాపన



మూలనపడిన స్వీపింగ్ యంత్రం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ బల్దియా అధికారుల అనాలోచిత నిర్ణయంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. పట్టణంలోని రోడ్లను శుభ్రం చేసేందుకు రూ.40లక్షల వ్యయంతో అధునాతన స్వీపింగ్ యంత్రాన్ని కొనుగోలు చేశారు. కానీ నిర్వహణ లోపంతో దాన్ని మూలన పడేశారు. రెండు నెలలు కూడా పనిచేయకుండానే యంత్రాన్ని పక్కన పెట్టేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో గతేడాదిన్నర కాలంగా స్వీపింగ్ మిషన్ వృథాగా మూలన పడి ఉన్న దాన్ని పట్టించుకునే పాపనపోవడం లేదు.

ఏడాదిన్నర కిందట కొనుగోలు..

గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాల్టీ రోజురోజుకూ విస్తరిస్తోంది. పట్టణంలో 49 వార్డులున్నాయి. పెరుగుతున్న జనాభా అవసరాలకనుగుణంగా ఆయా వార్డుల్లో తారు రోడ్ల నిర్మాణాలు సైతం పెద్ద సంఖ్యలోనే జరుగుతున్నాయి. ఇలాంటి రోడ్లపై పేరుకుపోయిన మట్టి, చెత్తచెదారాన్ని శుభ్రపరిచేందుకు రూ.40లక్షలను వెచ్చించి స్వీపింగ్ యంత్రాన్ని కొనుగోలు చేశారు. దీని ద్వారా రోడ్లను సులువుగా శుభ్రం చేయవచ్చని భావించారు. యంత్రాన్ని అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న చేతుల మీదుగా ప్రారంభించారు. దీంతో పట్టణ రోడ్లు ఎప్పటికప్పుడు శుభ్రమై పట్టణం సుందరంగా కన్పిస్తుందని ప్రజలు భావించారు. కానీ అది మున్నాళ్ల ముచ్చటగానే మారింది. సరిగ్గా రెండు నెలలు కూడా పనిచేయకుండానే యంత్రాన్ని మూలనపడేశారు. పట్టణంలోని ఒకటి, రెండు రోడ్లను మాత్రమే శుభ్రపరిచిన ఈ యంత్రం మరమ్మతుల పేరిట పక్కన పడేశారు. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయం ఎదుట గల వాటర్ ట్యాంక్ ప్రాంతంలో వృథాగా పడి ఉంది. మిషన్ నిర్వహణ భారీగా ఉంటుందని గుర్తించిన అధికారులు అనాలోచితంగా కొనుగోలు చేసి చిన్నపాటి రిపేర్ల పేరిట మూలనపడేశారు. ఏడాదిన్నరకాలంగా దాన్ని బయటకు తీయకపోవడంతో పనికిరాకుండా పోయే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతుంది. తమ పర్సంటేజీల కోసమే దీన్ని కొనుగోలు చేసి పక్కనపడేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిర్వహణ భారం

రోడ్లను శుభ్రపరిచే స్వీపింగ్ యంత్రం మూలనపడి ఉన్న విషయం ఇటీవలే నా దృష్టికి వచ్చింది. నిర్వహణకు భారీగా వ్యయం అవుతుంది. యంత్రం వినియోగించినదానికంటే దాని నిర్వహణకే రూ.80వేల నుంచి రూ.2లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది. అసలు ఈ యంత్రాన్ని ఎందుకు కొనుగోలు చేశారే అర్థం కావడం లేదు.

– ఎండీ. ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు



సాసర్ ఫిట్‌లో నీటిని నింపుతున్న అధికారులు

- దాహార్తి తీర్చేందుకు సాసర్ ఫిట్‌లు, నీటి కుంటల ఏర్పాటు


సాసర్‌ఫిట్ వద్ద జంతువులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలో 3 వేల హెక్టార్ల విస్తీర్ణంలో రిజర్వ్ ఫారెస్టు ఉంది. అందులో 400 హెక్టార్ల విస్తీర్ణంలో హరితవనం పార్కును 2018లో ఏర్పాటు చేశారు. ఈ అటవీ ప్రాంతంలో చుక్కల దుంపలు, నీలాగాయి, జింకలు, అడవి పందులు, నెమ్మలు, అటవీ జంతువులు వందల సంఖ్యలో ఉన్నాయి. వేసవి ప్రారంభం కావడంతో ఎండలు మండిపోతున్న తరుణంలో వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. తాగునీటి కోసం శివారు గ్రామాలకు వచ్చి వేటగాళ్ల ఉచ్చులో చిక్కకుండా అటవీ ప్రాంతాల్లో వాటి సంచారానికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

దాహార్తి తీర్చేందుకు..

హరితవనం పార్కులోని అటవీ జంతువుల దాహార్తిని తీర్చేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే చెలమలు, చెక్ డ్యాంల నిర్మాణం, సాసర్ ఫిట్‌లు, నీటి కుంటలను ఏర్పాటు చేశారు. వారానికి రెండుసార్లు సాసర్‌ఫిట్‌లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపి అటవీ జంతువుల దాహార్తిని తీర్చుతున్నారు.

నీటిని అందిస్తున్నాం



వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేటగాళ్ల బారిన పడకుండా వ్యూహాత్మక ప్రాంతాల్లో నిఘా వలయాలను ఏర్పాటు చేస్తున్నాం. లేనిచోట్ల నీటి తొట్టెలు నిర్మించి ఉన్న చోట్ల వాటికి నీటిని నింపుతున్నాం. వేసవిలో అటవీ జంతువులు దాహార్తి తీర్చేందుకు సాసర్ ఫిట్‌లు, నీటి కుంటలు ఏర్పాటు చేస్తున్నాం.

– ప్రశాంత్, ఎఫ్‌బీవో, మావల

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


జైనథ్: జెండా ఆవిష్కరిస్తున్న అస్తక్ సుభాష్


బేలలో..

బేల: మండల కేంద్రంతో పాటు డోప్టాల, సైద్‌పూర్, పాలాయితండా, గూడ, పాటన్, షంషాబాద్ గ్రామాల్లో 47 బూత్‌లలో శనివారం 44వ బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను స్థానిక నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాక్రే మురళీధర్, మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, బోనిగిరివార్ గణేష్,, కృష్ణకుమార్, బార్కడే రాము, నవీన్, కృష్ణ, ధర్నే జీవన్ పాల్గొన్నారు.

జైనథ్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు బీజేపీ జెండాలు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు ఉదయం బూత్‌ల వారీగా టిఫిన్ బైటక్‌లను నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. బెల్గాంలో బీజేపీ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, పార్టీలో బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు అస్తక్ సుభాష్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో, మండలంలోని ఏమాయికుంట, ఈశ్వర్‌నగర్ గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, కనక తుకారం, మరప రాజు, దిలీప్ మోరే, మస్కే రాజువర్ధాన్, కేంద్రే బాలు, మారుతి పాల్గొన్నారు.

నేరడిగొండ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. శనివారం పోలింగ్ బూత్ కేంద్రాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడే టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. మండల ప్రధాన కార్యదర్శి సాబ్లే సంతోష్ సింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చోడ: బీజేపీతోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ అన్నారు. శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, టిఫిన్ బైటక్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు బీజేపీకి ఓటు వేసి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి తహరే రమేశ్, గిరిజన మోర్చా అధ్యక్షుడు పోశెట్టి దళిత మోర్చా అధ్యక్షుడు రవి, జాదవ్ రాము పాల్గొన్నారు.

తుక్కుగూడకు తరలిన కాంగ్రెస్ నాయకులు


సభలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఇంద్రవెల్లి: తుక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించిన జనజాతర కార్యక్రమానికి ఇంద్రవెల్లి నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు శనివారం ఉదయం తరలి వెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో తుక్కుగూడకు వెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, కార్యకర్తలు సోమోరే నాగోరావ్, నాగ్‌నాథ్, సిడాం జంగు పాల్గొన్నారు.

నేరడిగొండ: తుక్కుగూడ జనజాతర సభకు బోథ్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు శనివారం తరలివెళ్లారు. బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ ప్రధాని అవ్వడం ఖాయమన్నారు. ఆయన వెంట బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడె వసంత్, బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, బోథ్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోతారెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

'దేశభక్తికి మారుపేరు బీజేపీ'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: దేశభక్తికి బీజేపీ అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందన్నారు. ప్రధాన నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు. కార్యకర్తలు దేశ సరిహద్దుల్లో ఉన్న సైనికులతో సమానంగా ధర్మం కోసం పనిచేస్తున్నారని కొనియాడారు.

ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలి


మేనిఫెస్టోను విడుదల చేస్తున్న నాయకులు

ఎదులాపురం: పీపుల్స్ మేనిఫెస్టోలోని విద్యారంగ డిమాండ్లను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్య నిర్వాహక కార్యదర్శి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీపుల్స్ మేనిఫెస్టో విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ ఫాసిస్టు, కార్పొరేట్ ఏజెండాను ముందుకు తీసుకెళ్తుందని మండిపడ్డారు. ప్రైవేటు సంస్థలకు పూర్తిగా స్వేచ్ఛనిస్తూ, మత విద్యను ప్రోత్సహిస్తూ విద్యారంగంలో వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణలను ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో రాహుల్, గణేశ్, సంతోశ్, రాకేశ్, ఇఫ్తారుద్దీన్, దీపలక్ష్మి, పూజ, అశోక్, దత్తాత్రి పాల్గొన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న గోడం నగేశ్

నేరడిగొండ: బీజేవైఎం మండల అధ్యక్షుడు బాక్రే లక్ష్మణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం శనివారం మండలంలోని బుర్కపల్లిలో ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

- నేరడిగొండ మండలంలోని వాంకిడి గ్రామానికి చెందిన తూము రాజేందర్ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.
- నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామంలో ఇటీవల పలువురు మృతి చెందారు. ఎరగ్గ రాములు, శాల చిన్న కొమురయ్య, డోకూరి లక్ష్మి, వంజరి శంకర్‌ల కుటుంబసభ్యులను కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు నాయిడి రవి, ధర్మదాస్ మహేందర్, పాల శంకర్, బొలిశెట్టి రాములు, ఇసాఖొద్దీన్, గాదె రవి, మాకునూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థిని గెలిపించాలి

ఆదిలాబాద్‌రూరల్: కార్యకర్తలు ఐక్యంగా ఉండి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీఎస్పీ ముఖ్య కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒక్కొక్కరిగా వారి అభిప్రాయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధిష్ఠానం టిక్కెట్ ఎవరికి కేటాయించిన అందరూ కలిసి కట్టుగా ఉండి అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు జంగుబాపు, బన్సీలాల్, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంఈవో నారాయణ

తలమడుగు: మండలంలో పాఠశాలకు మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో శేఖర్, ఎంఈవో నారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హెచ్‌ఎంలతో, అధికారులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఇతర పనులు పూర్తి చేయాలని కోరారు. పనుల్లో నిర్లక్ష్యం చేయకుండా వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తాహసీల్దార్ రాజమోహన్, ఏపీఎం స్వామి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

బజార్‌హత్నూర్: మండలంలోని చందునాయక్ తండాలో శనివారం మహాదేవుని మందిరంలో వేద పండితుడు ప్రవీణ్ దేశ్‌పాండే మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన, కలశ శిఖరం, పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, బలరాం జాదవ్, తాజా మాజీ సర్పంచులు పద్వల్ అనిత, ఫడ్ జ్ఞానేశ్వర్, ప్రియాంక అనిల్, మారుతి, ఎంపీటీసీ లక్ష్మి చందు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

తాంసి: మండల కేంద్రంలోని విద్యానగర్ సాయిబాబా ఆలయ నాల్గో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలు చేశారు. హోమం, అర్చన కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం వేకువజామున ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండం ప్రవేశం నిర్వహించారు. భక్తులు అగ్నిగుండం నుంచి దాటకుంటు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, సభ్యులు రాఘవేందర్, శ్రీకాంత్, సృజన్, సాయి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నీటి సదుపాయానికి విరాళం

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు రూ.5 వేల విరాళం అందజేశారు. విద్యార్థులకు తాగునీటి వసతి కోసం గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు మహేందర్, శరత్, సత్యనారాయణ తలకొంత పోగు చేశారు. వాటిని శనివారం పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్‌కు అందజేశారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

తాంసి: మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులు చేపడుతున్న కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గ్రామంలోని చెరువులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు కృష్ణ మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున మజ్జిగ పంపిణీ చేశారు. వారి వెంట గ్రామస్తులు సాయి, అశోక్, కల్యాణ్, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలి

నేరడిగొండ: రైతులు పండించిన మొక్కజొన్న పంటను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎకరానికి కేవలం 8 క్వింటాళ్ల 85 కిలోలు మాత్రమే పంట కొనుగోలు చేస్తామని షరతు విధించడం సరికాదన్నారు. శనివారం బోథ్ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

రంజాన్ సరుకుల పంపిణీ

ఎదులాపురం: రంజాన్ పండగ నేపథ్యంలో బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిరుపేద ముస్లింలకు రంజాన్ సరుకులు పంపిణీ చేశారు. ప్రైవేటు టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు ఇర్షద్ హాజరై సరుకులు పంపిణీ చేశారు. సొసైటీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్, సలహాదారులు సాబీర్, మోయిన్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలోని సల్యాదలో శనివారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది శేక్‌రావు, దేవురావులు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెల రోజుల నుంచి మండల వ్యాప్తంగా పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు.